క్లుప్తంగా

ముగిసిన రెవెన్యూ సదస్సులు

బోనకల్: భూభారతి చట్టంలో భాగంగా మండలవ్యాప్తంగా ఈ నెల 5నుంచి నిర్వహించిన రెవెన్యూ సదస్సులు శుక్రవారం ముగిశాయి. గోవిందాపురం(ఏ) గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 59 మంది రైతులు భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పున్నం చందర్ మాట్లాడుతూ.. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మైతిలి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్లలో చెక్‌పోస్టు

కొణిజర్ల: పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశాల మేరకు కొణిజర్ల బస్వాపురం క్రాస్ రోడ్డులో శుక్రవారం పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. వచ్చే నెలలో బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని పశువుల అక్రమ రవాణాను అడ్డుకోవాలనే ఉద్దేశ్యంతో చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 24 గంటల పాటు చెక్‌పోస్టులో సిబ్బంది అప్రమత్తంగా ఉండి పశువుల అక్రమ రవాణాను అడ్డుకుంటారన్నారు. చట్ట విరుద్ధంగా ఆవులు, దూడలు రవాణా చేసే వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

సత్తుపల్లిటౌన్: ఈ వేసవి సీజన్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా నిత్యం చర్యలు తీసుకుంటామని డీఈఈ రాములు అన్నారు. సత్తుపల్లి బాలాజీ థియేటర్ సెంటర్, కల్పతరురోడ్‌లలో నూతనంగా ఏర్పాటు చేసిన 160 కేవీఏ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ శరత్‌బాబు, లైన్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు సడలించాలి

ఏన్కూరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ నింబంధనలు సడలించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలో నిర్వహించిన ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో 400 – 600 చదరపు స్థలం, 60 గజాలు కాకుండా వెసలుబాటు కల్పించాలని కోరారు. అలాగే, రాజకీయ వివక్ష లేకుండా అర్హులు అందరికీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బాలాజీ, నాగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, బొంతు సమత, వెంకటయ్య, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



చెక్కు అందిస్తున్న లయన్స్ సభ్యులు

వైరారూరల్: మండలంలోని ఖానాపురం గ్రామానికి చెందిన చిన్నంగులూరి వెంకటేశ్వరి కుమారుడు మురళి కొంత కాలంగా గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. గ్రామానికి చెందిన మాజీ జెడ్పీకోఆప్షన్ సభ్యుడు షేక్.లాల్ మహ్మద్ చొరవతో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్, లయన్స్ హార్ట్ అండ్ ఐ ట్రస్టు సభ్యుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ హైదరాబాద్‌లోని లయన్స్ హార్ట్ ట్రస్టును సంప్రదించి ట్రస్ట్ నుంచి శుక్రవారం రూ.30 వేలు చెక్కు మురళి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి వెంకటేశ్వరరావు, ఏడ నూతల బుచ్చిరామారావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన కోట నగేష్‌పై శుక్రవారం కేసు నమోదైంది. కౌలు భూమి విషయంలో గ్రామానికి చెందిన పగిళ్లపల్లి పానకాలు – అలివేలు దంపతులను నగేష్ దూషిస్తూ చంపుతానని బెదిరించాడు. దీంతో అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గాయాలు

ఎర్రుపాలెం: ట్రాక్టర్ – బైక్ ఢీకొన్న ఘటనలో పెగళ్లపాడుకు చెందిన యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పెగళ్లపాడుకు సగ్గుర్తి సుధీర్ శుక్రవారం రాత్రి బైక్‌పై సఖినవీడు వెళ్తుండగా మొక్కజొన్న లోడ్‌తో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సుధీర్‌కు 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స చేశాక మధిరకు అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

టిప్పర్ల అద్దాలు ధ్వంసం

ముదిగొండ: మండల పరిధిలోని బీవీఆర్ స్టోన్ క్రషర్‌పై గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈమేరకు క్రషర్ యజమాని వెంకటేశ్వరరావు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. స్టోన్ క్రషర్‌కు చెందిన క్వారీ వద్దకు వచ్చిన ఖానాపురం వాసులు 15మంది టిప్పర్ల అద్దాలనే కాక కార్యాలయ గదిలోని అద్దాలను పగలగొట్టారు. రూ.3లక్షల నష్టం జరిగినట్లు అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ మురళి తెలిపారు.

పంచాయతీ భవనాలు.. పూర్తయ్యేనా..?



మత్యేపల్లిలో అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ నూతన భవనం

- నిధులు లేక నిలిచిన నిర్మాణాలు
- అద్దె భవనాల్లో కార్యకలాపాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, సిబ్బంది

మండలంలో పలు గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణాలు పూర్తికాక అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. నిధుల సరిపడక పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అవి ఎప్పుడు పూర్తి అవుతాయో కూడా తెలియని పరిస్థితి. పంచాయతీ నూతన భవన నిర్మాణాలపై 'సాక్షి'ప్రత్యేక కథనం..

చింతకాని: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీలకు భవనాలు సక్రమంగా లేకపోవటంతో ఆయా పంచాయతీలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద నూతన భవన నిర్మాణాలకు రూ.16 లక్షలు మంజూరు చేశారు. చింతకాని మండలం మత్యేపల్లి



మత్యేపల్లిలో అద్దె భవనంలో కార్యాలయం

గ్రామంలో తొమ్మిదేళ్ల క్రితం నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ స్లాబ్ వరకు మాత్రమే నిర్మించారు. నిధులు సరిపడక పనులను మధ్యలోనే నిలిపివేశారు. దీంతో ఆ భవనం పశువులకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

నూతన గ్రామాల్లో అసంపూర్తిగా..

మండలంలో నూతనంగా ఏర్పాటైన తిరుమలాపురం, రాఘవాపురం, గాంధీనగర్‌కాలనీ, నాగులవంచ రేల్వేకాలనీ, రేపల్లెవాడ, నర్సింహాపురం గ్రామ పంచాయతీల్లో తిరుమలాపురం, గాంధీనగర్‌కాలనీ, రేపల్లెవాడ, నర్సింహాపురం గ్రామ పంచాయతీలకు మాత్రమే నూతన భవన నిర్మాణాలకు ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షల నిధులను మంజూరు చేశారు. వీటిలో తిరుమలాపురం, గాంధీనగర్‌కాలనీ గ్రామ పంచాయతీల్లోనే నూతన భవన నిర్మాణ పనులను పూర్తి చేయగా.. మిగిలిన గ్రామాల్లో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

అద్దె భవనాల్లో కార్యకలాపాలు..

సొంత భవనాలు లేని మత్యేపల్లి, రేపల్లెవాడ, రాఘవాపురం, నాగులవంచ రైల్వేకాలనీ, నర్సింహాపురం గ్రామ పంచాయతీలు ప్రస్తుతం అద్దె భవనాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నారు. అద్దె భవనాలతో ఇబ్బందికరంగా ఉందని, కొత్తగా ఏర్పాటైన మిగిలిన పంచాయతీలకు కూడా పూర్తి స్థాయిలో నిధులను మంజూరు చేయాలని గ్రామ ప్రజలు కోరారు. ఇకనైనా అధికారులు స్పందించి అసంపూర్తి భవన నిర్మాణాలను పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చే విధంగా ఆలోచన చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పనులు పూర్తి చేస్తాం..

గ్రామ పంచాయతీ నూతన భవనాల నిర్మాణాలకు ఈజీఎస్ నుంచి మంజూరైన నిధులతో పనులను చేపట్టడం జరిగింది. మిగిలిపోయిన గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులకు అవసరమయ్యే రూ.10 లక్షల నిధులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే అసంపూర్తిగా ఉన్నటువంటి గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పూర్తిచేస్తాం.

– కె.రోహిత్, పంచాయతీరాజ్, మండల ఏఈ, చింతకాని

అసాంఘిక కార్యకలాపాలు..



గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనం పశువులకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గ్రామ పంచాయతీ నూతన భవనం పూర్తి కాకపోవడంతో అద్దె భవనంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. దీంతో మాతోపాటుగా సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా పనులు పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. – పగడాల అంజయ్య, మత్యేపల్లి

డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ



తల్లాడ: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



ముదిగొండలో..

మధిర/ఎర్రుపాలెం/ముదిగొండ/తల్లాడ/కల్లూరు రూరల్: డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్, పీహెచ్‌సీ వైద్యాధికారులు అరుణాదేవి, పృథ్వీరాజ్ నాయక్, రత్నమనోహర్, నవ్యకాంత్, తబుస్సుమ్ తెలిపారు. ప్రపంచ డెంగీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్య సిబ్బంది ఎర్రుపాలెంలోని బనిగండ్లపాడులో, మధిరలోని.. దెందుకూరులో, ముదిగొండలో ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా తల్లాడలో వైద్యసిబ్బంది ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. కల్లూరు, చెన్నూరు ప్రభుత్వ ఆస్పత్రుల ఆధ్వర్యంలో.. వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. డెంగీ నియంత్రణకు ప్రత్యేక బృందాలను నియమించి, పారామెడికల్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ప్రతీ మంగళవారం, శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. వ్యాధి రావడానికి గల కారణాలు, వ్యాధి నిర్మూలనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించి.. కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఖాళీ సీసాలు, కొబ్బరి బొండాల్లో, టైర్లలో ఉన్న నిల్వ నీటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ మదుసూదన్‌రావు, వైద్యులు కార్తీక్, రంజిత్, అశ్విని, లక్ష్మీలోహిత, దివ్య, శృతి, విజయ్‌కుమార్, నీలిమ, హెల్త్ సూపర్‌వైజర్లు లత, పద్మావతి, రామారావు, శ్రీకర్, పెద్ద పుల్లయ్య, భాస్కర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు..

వైరా: యువతీ యువకులు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని వైరా ఎస్సై పి.రామారావు సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా మత్తు పదార్థాలకు బానిస అయినా, అమ్మినా, కొనుగోలు చేసినా అట్టి వారి వివరాలు తెలియజేయాలన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

కల్లూరురూరల్: ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు తెలిపారు. శుక్రవారం మండలంలోని కోరట్లగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సదర్భంగా ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖుడు రిటైర్డ్ సీఐ బైరెడ్డి రాఘవరెడ్డి గృహాన్ని సందర్శించి.. సేంద్రీయ ఎరువులతో ఆయన పండించిన కూరగాయలు, రకరకాల పండ్లను పరిశీలించారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పున్నం చందర్

బోనకల్: రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో కాకుండా మీ సేవలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులను క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని తహసీల్దార్ పున్నం చందర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశం ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా 280మంది తమకు రేషన్ కార్డు కావాలని మీసేవలో దరఖాస్తు చేసుకున్నారని, వారి అర్హతలను పరిశీలన చేయాలని ఆదేశించారు. అదేవిధంగా వివిధ ప్రదేశాలకు వెళ్లిన వారిని, మృతి చెందిన వారిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శాస్త్రి, సూపర్‌డెంట్ రవికుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పరామర్శ..

కల్లూరురూరల్: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు దేవరపల్లి పట్టాభిని శుక్రవారం లింగాల గ్రామంలో కల్లూరు మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో కల్లూరు సొసైటీ చైర్మన్ లక్ష్మణరావు, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ సర్పంచ్ ప్రసాద్, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్

కొణిజర్ల: మండల కేంద్రం కొణిజర్ల బస్వాపురం క్రాస్‌రోడ్డులో మిషన్‌భగీరథ పైప్‌లైన్ పగిలిపోయి నీరంతా వృథాగా పోతుంది. తారురోడ్డు సైతం ధ్వంసమై భారీగా గుంత పడుతున్నది. ఈ విషయాన్ని స్థానికులు అధికారులకు తెలిపినా.. అటు వైపు ఎవరూ చూడడం లేదు. ఇప్పటికే పలు గ్రామాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తాగునీటికి దూరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ భగీరథపైప్‌లైన్ సుమారు 16మండలాలకు తాగునీటిని సరఫరా చేస్తుంది. మరమ్మతులు చేయకపోతే ఆయా మండలాలకు నీటి సరఫరా తగ్గే అవకాశముంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే పైప్‌కు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వైరా: వైరా సబ్‌స్టేషన్, వైరా టౌన్–2లో ఫీడర్ మరమ్మతులు నిర్వహిస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పి.సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఫిషరీస్‌కాలనీ, శాంతినగర్, సంత బజార్, కోటయ్య ఆస్పత్రి ఏరియా, యాదవ బజార్, మహాలక్ష్మి దేవాలయం బజార్, బీసీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కల్లూరురూరల్: కల్లూరు విద్యుత్‌సబ్ స్టేషన్ పరిధిలోని కల్లూరు, చంద్రుపట్ల, రఘునాధగూడెం, నారాయణపురం, గోపాలదేవినబోయినపల్లి, వాచ్యనాయక్‌తండా, హనుమతాండ, గనియా తండా, లక్ష్మాతాండ, చంద్యాతాండ, లోకవరం, పుల్లయ్యబంజరు, పడమర లోకవరం గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ వెంకట్ తెలిపారు.

ఎర్రుపాలెం: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మీనవోలు, ఎర్రుపాలెం, పెద్దగోపవరం, రేమిడిచర్ల ఫీడర్ల గ్రామాల్లో శనివారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జి.అనూష శుక్రవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

కొణిజర్ల: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైరా వైపు నుంచి ఖమ్మం వెళ్తున్న ఓ కారు పల్లిపాడు స్వర్ణభారతి కోల్డ్‌స్టోరేజీ సమీపాన ఎదురుగా వస్తున్న ఇంకో కారును ఢీకొట్టింది. ఇదే సమయాన వైరా వైపు నుంచి కారు వస్తుండగా, దాని వెనకాల ఉన్న ఇంకో మూడు కార్లు అదుపు తప్పి ముందు ఉన్న కార్లను ఢీకొట్టాయి. అంతేకాక ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తల్లాడ కానిస్టేబుల్ శశి వాహనాన్ని సైతం కార్లు ఢీకొట్టడంతో ఆయన కాలు విరిగింది. కార్లలో ఉన్న మరో ముగ్గురికి కూడా గాయాలు కాగా, 108లో ఖమ్మం తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సూరజ్ తెలిపారు. అలాగే, బస్వాపురంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనగా ఒకరికి గాయాలయ్యాయి. కొణిజర్ల మండలం పెద్ద మునగాలకు చెందిన లారీ డ్రైవర్ పిట్టల వెంకటనారాయణ విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తూ బస్వాపురంలో ఎదురుగా వచ్చిన వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలు కాగా ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు.

మద్దతు ధర కల్పించాలి

ఎర్రుపాలెం: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నర్సింహాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన రైతాంగ సదస్సులో వారు మాట్లాడారు. రైతు సంక్షేమం దిశగా పాలకులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, జోగయ్య, కిశోర్, రాములు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నిర్విరామంగా సంక్షేమ పథకాలు



కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాయకులు

వైరా: రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకపోయినా, లోటు బడ్జెట్‌లో ఉన్నా సంక్షేమ పథకాలు అగకుండా కొనసాగిస్తున్నామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల కుటుంబాలలో వెలుగులు నింపడానికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొనసాగిస్తున్నామన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య అందించడానికి సీఎం రిలీఫ్‌ఫండ్ ఆరోగ్య శ్రీ పథకాలు ఉన్నాయన్నారు. తహసీల్దార్ కేవీ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి కట్ల రంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, గంగారావు, బుజ్జి, అశోక్, నాగిరెడ్డి, సైదా, సత్యం, తిరుపతిరావు, సీతారాముమలు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

మధిర: కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని, అప్పుడే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మధిర పట్టణంలోని రెడ్డి గార్డెన్ కల్యాణ మండపంలో.. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మిరియాల వెంకటరమణ గుప్తా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. త్వరలో పార్టీ సంస్థాగత ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసేదుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, నాయకులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, గాలి దుర్గారావు, అంబటి వెంకటేశ్వరరావు, కొమ్మినేని రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి



కల్లూరు: గులాబీ అందిస్తున్న ఆర్ఎం సరిరామ్



సత్తుపల్లిటౌన్: ప్రయాణికుడికి గులాబీ కీ చైన్ అందిస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్/కల్లూరు: బస్సులో ప్రయాణించే ప్రయాణికులతో ఆర్టీసీ ఉద్యోగులు మర్యాదగా ప్రవర్తించాలని ఖమ్మం రీజనల్ మేనేజర్ ఎ.సరిరామ్, డీఎం యు.రాజ్యలక్ష్మి తెలిపారు. మర్యాద దినోత్సవం(కర్టసిడే) సందర్భంగా శుక్రవారం సత్తుపల్లి బస్టాండ్, కల్లూరు నూతన బస్టాండ్‌లో.. బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు ఎంబ్లంతో కూడిన కీ చైన్లు, గులాబీలు అందించి అభినందించారు. కల్లూరు బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులందరికీ ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసి.. దాతలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రయాణికులే సంస్థకు మూలాధారమని వారి పట్ల మర్యాదగా ప్రవర్తించడం మన బాధ్యత అని ఉద్యోగులకు సూచించారు. అనంతరం సిబ్బందితో గేటు మీటింగ్‌ను ఏర్పాటు చేసి సంస్థ అభివృద్ధికి చేపట్టాల్సిన వ్యూహాలను వివరించారు. రిజర్వేషన్ బస్సుల్లో విధులు నిర్వహించే సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఖమ్మం డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య, అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, వీబీఓ ఆనంద్, అధికారులు పాల్గొన్నారు.

భూదాన్ భూములు పంచాలి



బుగ్గపాడులో ప్రచారం నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

సత్తుపల్లి: బుగ్గపాడు భూదాన్ భూములను పేదలకు పంచాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెంజిల్లా సహాయ కార్యదర్శి గొని నాగేశ్వరరావు, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి ఎస్‌కె ఉమర్‌లు డిమాండ్ చేశారు. ఈ నెల 17న సత్తుపల్లిలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని బుగ్గపాడు, రుద్రాక్షపల్లిలలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బుగ్గపాడు సర్వే నంబర్ 361లో 400 ఎకరాల భూమి ఉంటే 180 ఎకరాల భూమి మాత్రమే సాగులో ఉందని, భూదాన్ భూమి454 సర్వే నంబర్ 350 ఎకరాల భూమి ఉందని ఇది ప్రభుత్వ భూమి అని వీటిని అటవీశాఖ ఆక్రమించుకొని చెట్లు నాటిందన్నారు. అదే విధంగా సీతారామ ప్రాజెక్టు నీళ్ల ఏజెన్సీ మండలాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అవులూరి మధు, ముక్తి సత్యం, ఉపేందర్‌రావు, తుపాకుల నాగేశ్వరరావు, సీతారామయ్య, రాఘవులు, కొండపనేని సత్యనారాయణ, లక్ష్మయ్య, రామలక్ష్మి, సుక్కమ్మ, లక్ష్మి, మణిమ్మ, సుభద్ర పాల్గొన్నారు.

సకాలంలో కల్వర్టు నిర్మించాలి



అధ్వానంగా ఉన్న రహదారి

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల – లక్ష్మీనగర్ గ్రామాల మధ ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న కల్వర్టును త్వరగా పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరతున్నారు. ఈ రోడ్డు పనులు నెలల తరబడి కొనసాగడంతో పక్కన ప్రత్యామ్నాయంగా తయారు చేసిన రోడ్డుపై ప్రయాణం సాగించాలంటే ప్రయాణికులు భయపడుతున్నారు. దీనికి తోడు వర్షాలు.. ఇక రోడ్డంతా బురదమయంగా తయారైంది. బైపాస్‌రోడ్డు అధ్వానంగా ఉంది. కల్వర్టు నిర్మాణం కారణంగా లక్ష్మీనగర్ కాలనీవాసులకు సరఫరా అయ్యే మిషన్ భగీరథ పైప్ పగలడంతో అక్కడి ప్రజలకు తాగునీరు రావడం లేదు. ఇకనైనా అధికారులు త్వరితగతి కల్వర్టు పనులు పూర్తిచేసి ఆదుకోవాలి.

ఆగని ఇసుక దందా..



సత్తుపల్లిలో పట్టుబడిన ఇసుక లారీలు

సత్తుపల్లి: ఆంధ్రా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు.. అధికారుల కన్నుగప్పి ఇసుక సరిహద్దులు దాటి వచ్చేస్తుంది. వేంసూరు మండలం నుంచి కృష్ణనది ఇసుక, అశ్వారావుపేట, చింతలపూడి మండలం వైపు నుంచి గోదావరి ఇసుక సత్తుపల్లి పట్టణానికి అడ్డూ అదుపు లేకుండా రోజుకు పదుల సంఖ్యలోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

సరికొత్త మార్గాల్లో..

ఓ వైపు అధికారులు నిఘా ఏర్పాటు చేసినా అక్రమ రవాణాదారులు సరికొత్త దారుల్లో ఇసుక అక్రమ రవాణా ఇంకా జరుగుతూనే ఉన్నట్లు తెలిసింది. సత్తుపల్లి పట్టణ శివారులో ప్రభుత్వం తరపున ఇసుక డంపింగ్ యార్డ్ పెట్టినా.. అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడకపోవటం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది.

ముఠామేస్త్రీల పర్యవేక్షణలో..

ఇసుక అక్రమ రవాణా ముఠా మేస్త్రీల కనుసన్నల్లోనే ఆర్డర్లపై డెలివరీ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. సత్తుపల్లి పట్టణంలో ఐదారుగురు ఇసుక అక్రమ రవాణాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, వీరికి అన్ని వైపుల నుంచి సమాచారం వస్తుండటంతో ఒక్కోసారి ఇసుక అక్రమ లారీలు పట్టుబడినా.. రవాణామాత్రం యధాతధంగానే చేస్తున్నారని, సత్తుపల్లి పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన ఓ ముఠా మేస్త్రీ ఇసుక అక్రమ రవాణాకు కేంద్ర బిందువుగా ఉన్నాడని ప్రచారంలో ఉంది.

నిఘా పెంచిన అధికారులు..

ఇసుక అక్రమ రవాణాపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి చూపించటంతో రెండురోజుల వ్యవధిలో సత్తుపల్లిలో రెండు, వేంసూరులో రెండు ఇసుక లారీలు, టిప్పర్లు పట్టుబడ్డాయి. అయినా అక్రమ రవాణాదారులు ఇతర మార్గాల్లో రవాణా చేసేందుకు వెనుకాడటం లేదనే ప్రచారం జరుగుతుంది. ఒక టిప్పర్ పట్టుబడితే జరీమాన కట్టి మరీ అదే పనిలో ఉన్నట్లు తెలిసింది.